నేడు భద్రాద్రికి ఎమ్మెల్సీ కవిత రాక

భద్రాచలం/మణుగూరు టౌన్, ఏప్రిల్ 20: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సోమవారం భద్రాచలంలో రానున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, భద్రాచలం బీఆర్ఎస్ నాయకులు ఆదివారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. తొలుత ఉదయం 9 గంటలకు భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారిని ఆమె దర్శించుకుంటారాన్నారు. 10 గంటలకు భద్రాచలంలలోని హరిత హోటల్‌లో ఉద్యమకారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశంలో పాల్గొంటారు.

నేడు చలివేంద్రం ప్రారంభించనున్న ఎమ్మెల్సీ

దుమ్ముగూడెం, ఏప్రిల్ 20: భద్రాచలం నియోజకవర్గ పర్యటనకు వస్తున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కార్యక్రమంలో భాగంగా మండలంలోని నర్సాపురంలో రావులపల్లి నాగభూషణం, సుశీలమ్మ మెమోరియల్ సేవాసంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఉదయం 11 గంటలకు ఎమ్మెల్సీ కవిత ప్రారంభిస్తారని బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి పృథ్వీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

27న పార్టీ దిమ్మెలపై జెండాలు ఎగురవేయాలి

రేపటి బైక్ ర్యాలీని శ్రేణులు విజయవంతం చేయాలి: రేగా

మాట్లాడుతున్న రేగా కాంతారావు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 20: ఈ నెల 27న రజతోత్సవ సభకు వెళ్లే ముందు అన్ని గ్రామాల్లోనూ పార్టీ దిమ్మెలపై గులాబీ జెండాలను ఎగురవేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు.. శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇందుకోసం జెండా రంగులు వేసి, తోరణాలు కట్టి దిమ్మెలను ముస్తాబు చేయాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే, ఈ రజతోత్సవ సభ విజయవంతం కోసం ఈ నెల 22న బైక్ ర్యాలీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కాగా, రజతోత్సవ సభ కోసం మణుగూరు మండలంలోని వివిధ పంచాయతీల్లో, పట్టణంలోని వివిధ వార్డుల్లో, బస్తీల్లో కోలాహలం మొదలైంది. నాయకులు జెండా పండుగకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

టేకులపల్లి, ఏప్రిల్ 20: టేకులపల్లిలోని సబ్‌మార్కెట్ యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే కోరం కనకయ్య, కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. ఈ సందర్భంద వారు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, వ్యవసాయ శాఖ ఏడీఏ లాల్‌చంద్, ఏవో అన్నపూర్ణ, తహసీల్దార్ నాగభవాని, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మర వరప్రసాద్ గౌడ్, నాయకులు కోరం సురేందర్, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూరూప కలయిక

గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఇల్లెందు, ఏప్రిల్ 20: ఇల్లెందు జేబీఎస్ హైస్కూల్‌లో 2007-08సంవత్సరంలో 10వతరగతి చదివిన విద్యార్థులు.ఆదివారం ఇల్లెందులో 18సంవత్సరాల తరువాత కలిశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆట,పాటలతో జాలీగా గడిపారు. వారికి చదువు నేర్పిన గురువులు సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెద్దినేని సాయిచంద్, ఈసం లక్ష్మణ్, సాగర్, పూర్ణచందర్, సందీప్, రామకృష్ణ, ప్రియాంక, స్వాతి, సాయికిరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఐటీఐ విద్యార్థుల సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కొత్తగూడెం గణేష్ టెంపుల్, ఏప్రిల్ 20: స్థానిక ప్రభుత్వ ఐటీఐ 2004-2006 బ్యాచ్ ఎలక్ట్రీషియన్ ట్రేడ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో జరిగింది. ప్రిన్సిపాల్ జి.రమేష్‌ను, విశ్రాంత ప్రిన్సిపాల్ స్వామి నాథాన్ని పూర్వ విద్యార్థులు శాలువాలతో సన్మానించి, మెమెంటోలు అందించారు.

యాసంగి వరి కోతలు షురూ...

కరకగూడెం, ఏప్రిల్ 20: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సాగుచేసిన యాసంగి వరి పంట చేతికిరావడంతో రైతులు కోతలు షురూ చేశారు. ఈ యాసంగిలో సాగునీరు సరిగా అందకపోవడంతో దిగుబడులు తగ్గే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంట చేతికి వచ్చే సమయంలో సాగునీరు అందక పంటలు ఎండిపోయాయి. గ్రామాల్లో ప్రస్తుతం వ్యాపారులు పచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు.పండించిన ధాన్యానికి ప్రభుత్వం ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

భూ భారతితో సమస్యలు పరిష్కారం

కలెక్టర్ జితేశ్ వి పాటిల్

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ఇల్లెందు రూరల్, ఏప్రిల్ 20: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న నూతన చట్టం భూ భారతితో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆదివారం మండలంలోని బొజ్జాయిగూడెంలో గల ఎస్ఎస్ గార్డెన్స్‌లో జరిగిన భూ భారతి అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూ సంబంధిత సమస్యలతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున ప్రభుత్వం రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ధరణి పోర్టల్ స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భూభారతి పోర్టల్‌తో భూ ములకు సంబంధించిన వివాదాలు, రికార్డుల్లో లోపాలు, నకిలీ పత్రాల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపవచ్చన్నారు. ఆధార్‌నెంబర్ ఉన్నట్లు భూధార్ నెంబర్లు భూమికి ఉండాలన్నదే పోర్టల్ లక్ష్యమన్నారు. భూమి ఉన్న జిల్లా, మండలం, గ్రామం వివరాలు లేదా పాస్‌బుక్ నెంబర్ ఎంటర్ చేసి రికార్డులన్ని పొందవచ్చన్నారు. పట్టాదారులకు పాస్‌పుస్తకాలు నిర్వహించే ప్రక్రియ కూడా భూ భారతి ద్వారా నిర్వహించనున్నారని తెలిపారు. పాస్‌బుక్‌లో ఎలాంటి లోపాలున్నా తహసీల్దార్ సరిదిద్దే అవకాశం ఉందని, మరేదైనా అభ్యంతరం ఉంటే ఆర్డీవో, జిల్లా కలెక్టర్లకు అప్పిల్ చేసుకునే అవకాశాన్ని కల్పించారన్నారు. భూ భారతి చట్టంపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఆర్‌డీవో మధు, డీఎల్‌పీవో రమణ, తహసీల్దార్ కోట రవికుమార్, ఎంపీడీవో ధన్‌సింగ్, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదివారం మండలంలోని ఎస్ఎస్ గార్డెన్స్‌లో జరిగిన భూ భారతి అవగాహన సదస్సు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఆలేటి కిరణ్ మాట్లాడుతూ మండలంలోని దేవులపల్లి యాకయ్యనగర్, సున్నం రాజయ్యనగర్, మల్లుస్వరాజ్యం నగర్ గుడిసెవాసులకు ఇంటి నెంబర్లు కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పించాలని, జేకే ఓసీ నిర్వాసితులకు కేటాయించిన క్వార్టర్ల కూల్చివేతను నిలిపివేయాలన్నారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో నాయకులు తాళ్ళూరి కృష్ణ, మన్నెం మోహన్‌రావు, వజ్జా సురేశ్ పాల్గొన్నారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలం, ఏప్రిల్ 20: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని ఐటీడీఏలోని సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు జరిగే గిరిజన దర్బార్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీవో రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు. గిరిజనులు తమ సమస్యలను లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు.

నేటి 'ప్రజావాణి' రద్దు

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 20: కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన 'ప్రజావాణి'ని రద్దు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. భూభారతి చట్టంపై జిల్లావ్యాప్తంగా అవగాహన సదస్సులను అధికారులు నిర్వహిస్తున్నందున 'ప్రజావాణి'ని రద్దు చేసినట్లు వివరించారు. దీనిని ప్రజలంతా గమనించాలని, కలెక్టరేట్‌కు రావొద్దని కోరారు.

నేడు భూభారతిపై అవగాహన సదస్సు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 20: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూభారతి చట్టం-2025పై మణుగూరులోని కిన్నెర కల్యాణ మండపంలో సోమవారం ఉదయం10 గంటలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని తహసీల్దార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సులో ఎమ్మెలే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ హాజరవుతారని, ప్రజలు, రైతులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని తహసీల్దార్ కోరారు.

ఈత పోటీల్లో ప్రతిభ

మెడల్‌తో మంగ ప్రవీణ్

రామవరం, ఏప్రిల్ 20: గోవాలో ఈ నెల 19, 20 తేదీల్లో జరిగిన ఈత పోటీల్లో స్థానిక రుద్రంపూర్‌కు చెందిన మంగ ప్రవీణ్ పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందుకున్నాడు. కిలోమీటర్ దూరాన్ని 28.29 నిమిషాల వ్యవధిలో చేరుకున్నాడు. ఈ పోటీలను గోవా ఆక్వాటిక్ క్రౌన్-2025 ఓపెన్ వాటర్ స్విమ్మింగ్ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గోవా స్విమ్మింగ్ అసోసియేషన్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాటర్ స్పోర్ట్స్ నిర్వహించాయి.

25న సింగరేణి జీఎం కార్యాలయం ముట్టడి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రేగా కాంతారావు

మణుగూరు టౌన్, ఏప్రిల్ 20: సింగరేణి పరిరక్షణ కోసం ఈ నెల 22వ తేదీన అన్ని గనులు, డిపార్ట్‌మెంట్‌లలో అధికారులకు వినతి పత్రాలు, 25వ తేదీన జీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. ఆదివారం బీఆర్ఎస్ కార్యాలయంలో ముట్టడికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రానికి కొంగు బంగారంగా నిలుస్తున్న సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే కుట్రలకు బీజేపీ ప్రభుత్వం పూనుకుందని, దానికి వత్తాసు పలుకుతూ బొగ్గు గనుల వేలానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేదోడు వాదోడుగా నిలుస్తూ ఉజ్వల భవిష్యత్ ఉన్న సింగరేణి గొంతు నొక్కి బడా బాబులకు అప్పజెప్పి కుటీల ప్రయత్నాలు చేస్తుందని ధ్వజమెత్తారు. అందుకు కార్మిక వర్గం ఏకతాటిపై నిలిచి టీబీజీకేఎస్ చేసే పోరాటానికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు కుర్రి నాగేశ్వరరావు, కుంట లక్ష్మణ్, అక్కిన నర్సింహారావు, ఆవుల నర్సింహారావు, రమేశ్, రాహుల్, టీబీజీకేఎస్ నాయకులు బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 20: యువతిని సోషల్ మీడియా వేదికగా వేధిస్తున్న యువకుడిపై కొత్తగూడెం వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు.. కొత్తగూడెం పట్టణానికి చెందిన ఓ యువతి, సుజాతనగర్ మండలంలోని ప్రైవేటు కళాశాలలో చదువుతున్నప్పుడు.. తన సహాధ్యాయి అయిన వైరా మండలం విప్పలమడుగు గ్రామానికి చెందిన అమ్మాయి ద్వారా ఆమె సోదరుడు బి.రాహుల్‌తో పరిచయం ఏర్పడింది. అతడిని ఆమె సోదర సమానుడిగా భావించి చనువుగా ఉంది. ఈ క్రమంలోనే ఆమె అతడి నుంచి కొంత డబ్బు అప్పు తీసుకుని, కొన్నాళ్ల తర్వాత తిరిగి ఇచ్చేసింది. తనకు ఇంకా కొంత బాకీ ఉన్నావని, బదులుగా తనకు శారీరకంగా దగ్గర కావాలని ఆమెను రాహుల్ వేధించాడు. ఈ విషయాన్ని ఆమె తన తల్లిదండ్రుల ద్వారా మండలంలోని ఓ పార్టీ నాయకులకు కొన్నాళ్ల క్రితం తెలిపింది. వారు పంచాయితీ పెట్టించి, రాహుల్‌ను తీవ్రంగా మందలించారు. అతడి తీరును మార్చాలంటూ అతడి తల్లిదండ్రులతోనూ గట్టిగానే చెప్పారు. ఇటీవల నుంచి రాహుల్ వేధింపులు మళ్లీ మొదలయ్యాయి. ఆమె పేరుతో అతడు ఇన్‌స్టాగ్రామ్ ఖాతా తెరిచి, అందులో అసభ్యంగా పోస్టులు పెడుతున్నాడు. ఆమె బంధువులకు, స్నేహితులకు ఆ ఖాతా ద్వారా వాటిని చేరవేస్తున్నాడు. ఆమె పెళ్లి సంబంధాలను చెడగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాడు. రాహుల్ సాగిస్తున్న ఈ వేధింపులన్నీ భరించలేని ఆ బాధితురాలు ఆదివారం వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదుతో రాహుల్‌పై వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ప్రభుత్వాసుపత్రుల్లో నాణ్యమైన వైద్యం

ప్యూరిఫైడ్ వాటర్ ఫ్రిడ్జ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జారే

అశ్వారావుపేట, ఏప్రిల్ 20: ప్రభుత్వాసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ చెప్పారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్యూరిఫైడ్ వాటర్ ఫ్రిడ్జ్‌ను ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రుల్లోని వైద్య సేవలను ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధారుక్మిణి, డాక్టర్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

గోదావరి అడుగంటింది....

నాడు నీటితో ఉన్న గోదావరి

నేడు అడుగంటిన గోదావరి

దుమ్ముగూడెం, ఏప్రిల్ 20: దుమ్ముగూడెం వద్ద ఐడెల్ ప్రాజెక్టు పరిధిలో గోదావరి అడుగంటింది. గతేడాది మే నెలలో కొద్దిపాటి నీటితో ఉన్న గోదావరి ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే నీరు లేక అడుగంటి పోయింది. ఇప్పటివరకు గోదావరి అడుగంటిపోవడమనేది ఎప్పుడూ చూడలేదని పలువురు పేర్కొంటున్నారు. నాడు కళకళలాడిన గోదావరి నేడు మే నెల రాకముందే ఇలా అడుగంటిపోయింది.

వృక్ష ప్రేమికుడికి గుర్తింపు

ధ్రువపత్రం అందుకుంటున్న విశ్వామిత్ర

చుంచుపల్లి, ఏప్రిల్ 20: మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ప్రకృతి ప్రేమికుడైన బాలుడు మూడ్ విశ్వామిత్ర చౌహాన్ పేరు 'జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో నమోదైంది. ఇప్పటివరకు 1035 మొక్కలు నాటినందుకుగాను పేరు చేర్చినట్లు 'జీనియస్' ప్రతినిధులు తెలిపారు. హైదరాబాద్ త్యాగరాయ గానసభలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఈ చిన్నారికి ధ్రువపత్రాన్ని అందించారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

కొత్తగూడెం సింగరేణి, ఏప్రిల్ 20: సింగరేణిలో ప్రైవేటీకరణ ఆపాలన్న డిమాండుతో ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు వివిధ రూపాల్లో ఆందోళనలను టీబీజీకేఎస్ నిర్వహించనుంది. ప్రచార వాల్ పోస్టర్‌ను రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ ఆదివారం కొత్తగూడెంలో ఆవిష్కరించారు. నాయకులు తుమ్మ శ్రీనివాస్, గడప రాజయ్య, వసికర్ల కిరణ్, కాగితపు విజయ్‌కుమార్, శనిగరపు శంకర్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

మణుగూరు టౌన్, ఏప్రిల్ 20: మున్సిపాలిటీ పరిధిలోని రాజుపేటకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రాజారాం అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఆదివారం ఆస్పత్రిలో పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ కుర్రి నాగేశ్వరరావు, పట్టణ కన్వీనర్ కుంట లక్ష్మణ్, నాయకులు అక్కి నర్సింహారావు, తురక రామకోటి, వేల్పుల సురేశ్ పాల్గొన్నారు.

రోడ్డు వెడల్పు చేయాలని సంతకాలు

కొత్తగూడెం అర్బన్, ఏప్రిల్ 20: పట్టణంలోని ఎన్‌టీఆర్ బొమ్మ నుంచి సింగరేణి ఆస్పత్రి వరకు రోడ్డు వెడల్పు పనులను వెంటనే పూర్తి చేయాలని కోరుతూ సీపీఎం నాయకులు ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. సేకరించిన సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని త్వరలోనే కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు చెప్పారు. భూక్యా రమేష్, ఎస్ఎస్.రాజు, గుగులోత్ సక్రాం, గిరి, అల్తాఫ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతులకు శంకుస్థాపన

దమ్మపేట రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని చెరువుల మరమ్మతులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం శంకుస్థాపన చేశారు. మండలంలో తొమ్మిది చెరువులకు రూ.40.2 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. నీటి పారుదల శాఖ డీఈ కృష్ణ, ఈఈ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చండ్రుగొండ: ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు, కొత్తగూడెం టౌన్: ప్రత్యేక ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు, బూర్గంపహాడ్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

ఇల్లెందు: ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

ఘనంగా ఈస్టర్ పండుగ

క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ప్రదర్శనలు నిర్వహించారు.

- 'నమస్తే' నెట్‌వర్క్, ఏప్రిల్ 20:

మణుగూరు టౌన్:ఈస్టర్ ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

భద్రాద్రి రామయ్య నిత్యకల్యాణం

నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం, ఏప్రిల్ 20: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం అంతరాలయంలో మూలవరులకు 108 స్వర్ణ పుష్పాలతో అర్చకులు అర్చన జరిపారు. అంతరాలయంలోని ధృవమూర్తులకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తులుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యపూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను ప్రాకార మండపానికి తీసుకువచ్చి కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్

రామయ్య సన్నిధిలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీవీ ఆనంద్, కుటుంబ సభ్యులు

భద్రాచలం, ఏప్రిల్ 20: భ ద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామిని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సీవీ. ఆనంద్ ఆదివా రం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. ధ్వజస్తంభం వద్ద పూజలు నిర్వహించి గర్భగుడిలో స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు. అనంతరం ఆలయంలోని ఉప ఆలయాలైన లక్ష్మీ తాయారు, అభయాంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేశా రు. ఆయన వెంట పోలీసు అధికారులు, అర్చకులు, అధికారులు ఉన్నారు.

సేవాలాల్ సేన నూతన కమిటీ ఏర్పాటు

సేవాలాల్ నూతన కమిటీ సభ్యులు

అశ్వాపురం, ఏప్రిల్ 20: మండల కేంద్రంలోని మినీ సేవాగడ్‌లో ఏర్పాటు చేసిన సేవాలాల్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి సేవాలాల్ సేన రాష్ట్ర కో కన్వీనర్ బాణావత్ హుస్సేన్‌నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పాత సేవాలాల్ సేన మండల కమిటీని రద్దు చేసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవ అధ్యక్షుడిగా గుగులోత్ మోహన్‌నాయక్, బానోత్ రాందాస్‌నాయక్, గౌరవ సలహాదారులుగా బానోత్ సదర్‌లాల్ నాయక్, ఇస్లావత్ నాగనాయక్, బాణావత్ సీతారాంనాయక్, బాణావత్ సక్రునాయక్, మండల అధ్యక్షుడిగా భూక్యా నర్సింహనాయక్, ప్రధాన కార్యదర్శిగా గుగులోత్ వీరాస్వామి నాయక్, ఉపాధ్యక్షుడిగా ఇస్లావత్ రాజునాయక్, కార్యదర్శిగా తేజావత్ సోమ్లా నాయక్, ప్రధాన కార్యదర్శిగా భూక్యా వెంకటరమణ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

గట్టుగూడెంలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

దమ్మపేట, ఏప్రిల్ 20: ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని గున్నేపల్లి పంచాయతీ గట్టుగూడెంలో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. పోస్టర్లు అంటించి, కరపత్రాలు పంచారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన

అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపహాడ్, ఏప్రిల్ 20: బూర్గంపహాడ్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం సందర్శించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగనీయొద్దని, ఎప్పటికప్పుడు వచ్చిన ధాన్యం కొనుగోలు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. నాయకులు కైపు రోశిరెడ్డి, బట్టావిజయ్‌గాంధీ, కైపు శ్రీనివాసరెడ్డి, మందా నాగరాజు, భజన ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

బైక్ చోరీ చేయబోయి పట్టుబడ్డాడు

అశ్వారావుపేట, ఏప్రిల్ 20: ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌ను చోరీ చేయబోయిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై యయాతి రాజు తెలిపిన వివరాలు.. పట్టణంలోని తూర్పు బజార్ నివాసి కొడమంచిలి రాజు, ఆదివారం తన ఇంటి ముందు బైక్ పార్కింగ్ చేశారు. దానిని చోరీ చేసేందుకు ఓ వ్యక్తి ప్రయత్నిస్తుండగా రాజు, స్థానికులు గమనించారు. అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం రైతుగూడెం గ్రామానికి చెందిన ఇతడి పేరు బల్లెం నాగేశ్వరరావు. ఆంధ్రప్రదేశ్‌లో ఐదు బైక్‌లు చోరీ చేసినట్లుగా ఇతనిపై కేసులు ఉన్నాయి. ఎస్సై యయతారాజు విచారణ జరుపుతున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. వ్యక్తికి తీవ్ర గాయాలు

కరకగూడెం, ఏప్